



బుధవారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 31.0°C | కనిష్టం : 20.0°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా : 6.33 గం..
సహర్ : శుక్రవారం ఉ : 4.57 గం..



కేసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను నమోదు చేస్తున్న ప్రైవేటు ఆపరేటర్లు (ఫైల్)

ఎదురుచూపులేనా..?

జాడలేని 'ప్రజాపాలన' డేటా ఎంట్రీ చార్జీలు

- జిల్లాలో 2.44లక్షల దరఖాస్తులు
- సగానికిపైగా ప్రైవేటు ఆపరేటర్లే
- ఒక్కో దరఖాస్తుకు రూ.5 నుంచి రూ.15 చొప్పున చెల్లింపు
- సుమారు రూ.25లక్షల బిల్లులు పెండింగ్..
- ఆపరేటర్ల ఎదురుచూపు

కేసముద్రం, మార్చి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే ప్రజలకు సంక్షేమ పథకాల అమలు కోసం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించింది. కాని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుకు సంబంధించిన డేటా ఎంట్రీ చార్జీల డబ్బుల కోసం ఆపరేటర్లు మూడు నెలలుగా ఎదురుచూస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో గత ఏడాది డిసెంబరు 28 నుంచి ఈ జనవరి 6 వరకు ఎనిమిది రోజులపాటు అన్ని గ్రామాల్లో 543 సభలను నిర్వహించి 87 బృందాలు, 2,610 సిబ్బందితో దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో 2,41,644 కుటుంబాల పరిధిలో 2,44,506 దరఖాస్తులు రాగా ప్రజాపాలనలో లేని అంశాలకు సంబంధించినవి 65,114 దరఖాస్తులు వెరసి 3,09,620 అర్జీలు ప్రజల నుంచి అందాయి. ఇందుకోసం నియోజవర్గానికి ఒక నోడల్ అధికారి, మండలానికో ప్రత్యేకాధికారిని నియమించి పకడ్బందీగా దరఖాస్తులను స్వీకరించారు. ఈ దరఖాస్తుల స్వీకరణ చివరితేదీ కంటే ఒకరోజు ముందు జనవరి 5న జిల్లా కలెక్టరేట్‌లో అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయంపై జిల్లా వ్యాప్తంగా 250 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు మాస్టర్ శిక్షకులచేత ట్రైనింగ్ సైతం ఇచ్చారు. ఇలా శిక్షణ పొంది వారు ఆయా మండలాల్లోని తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపాలిటీ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణనిచ్చారు. ఈ దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపాలిటీల్లో కమిషనర్లు పర్యవేక్షించారు.

ఒక్కో దరఖాస్తుకు రూ.5, రూ.15 చెల్లింపు

ప్రజాపాలన దరఖాస్తుల్లో ఒక్కో అప్లికేషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు ప్రభుత్వ సిబ్బందికి రూ.5ల చొప్పున, ప్రైవేటు ఆపరేటర్లకు రూ.15ల చొప్పున చార్జీలు చెల్లిస్తామని అధికారులు ఆపరేటర్లకు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆపరేటర్లకు ప్రతీ ఒక్కరికి వ్యక్తిగత లాగ్ ఇన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను జారీ చేశారు. వారి లాగ్‌ఇన్‌లో దరఖాస్తులోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులు భారీ సంఖ్యలో రావడం సమయం తక్కువగా ఉండడంతో జిల్లాలో సగానికిపైగా అప్లికేషన్లను ప్రైవేటు ఆపరేటర్లే నమోదు చేశారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగులు పలువురు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు తమ వ్యక్తిగత లాప్‌టాప్‌లు, కంప్యూటర్లను తీసుకువచ్చి దరఖాస్తుల నమోదు చేయగా కొందరు ఇంటికి తీసుకువెళ్లి ఎంట్రీ చేశారు. ఒక్కో ఆపరేటర్ రోజుకు వంద దరఖాస్తుల చొప్పున ఆన్‌లైన్ చేశారు. ఇతర దరఖాస్తులను ప్రత్యేకంగా ఎక్సెల్ షీట్‌లో నమోదు చేసి పంపించారు.

నమోదులో హడావిడి.. చార్జీల చెల్లింపుల్లో జాప్యం

ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో ఉన్న హడావుడి చార్జీల చెల్లింపులో కనిపించడంలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగమేఘాల మీద ప్రైవేటు ఆపరేటర్లతో వారం, పది రోజులపాటు నిరంతరం అధికారులు పనులు చేయించారు. ప్రస్తుతం గృహజ్యోతి పథకం కింద ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ పథకం ఇప్పటికే అమలుకాగా గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం పథకం అమలుకు సిద్ధంగా ఉంది. చేయూత పథకంలో వివిధ రకాల పింఛన్లు, ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు తదితర పథకాలకు ప్రజాపాలన వివరాలే ఆధారం. ఇంత కీలకమైన సమాచారం నమోదు చేసిన వారికి బిల్లుల చెల్లింపుల్లో మాత్రం అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆపరేటర్ల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుద్యోగులుగా ఉన్న తమకు చార్జీల రూపంలో కొంత లబ్ధి ఉంటుందనే ఉద్దేశంతో పని చేసినట్లు చెబుతున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ఆపరేటర్ల నుంచి బిల్లుల కోసం పంచాయతీ కార్యదర్శులపై తీవ్ర ఒత్తిడి ఉండడంతో ముందస్తుగా చెక్కులు జారీ చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ ఆ చెక్కులు పాస్ కాకుండా నిలిచిపోయినట్లు సమాచారం. ప్రభుత్వం స్పందించి తమకు డేటా ఎంట్రీ నమోదు చార్జీలను వెంటనే చెల్లించాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

ఆఘమేఘాలపై పని చేయించుకున్నారు...

- భూక్యా భాస్కర్, ప్రైవేటు డేటా ఎంట్రీ ఆపరేటర్, వెంకటగిరి



దాదాపు వారంరోజుల పాటు ఆఘమేఘాల మీద పనులు చేయించుకున్నారు. రోజుకు వంద చొప్పున సుమారు 600 దరఖాస్తుల వరకు నమోదు చేయడంతో రూ.9వేల వరకు డబ్బులు రావాలి. అధికారులను డబ్బులు అడిగితే పైనుంచి బిల్లు రాలేదని చెబుతున్నారు. నిరుద్యోగులమైన మాకు మాకు వెంటనే డేటా ఎంట్రీ చార్జీల బకాయిలను చెల్లించాలి.

సాగుకు నిరంతర విద్యుత్ అందించాలి

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



డోర్నకల్ మండలం గొల్లచర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

తొర్రూరు/నర్సింహులపేట, మార్చి 20 : రబీ పంటకు, తాగునీటి అవసరాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేపట్టాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తొర్రూరు డివిజన్ పరిధిలోని వివిధ సబ్ స్టేషన్‌లను తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. అంతరాయాలు వచ్చే అంశాలపై ఆరాతీసి సూచనలు ఇచ్చారు.. ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్చులు అమర్చకపోతే ఏబీ కేబుల్స్ దెబ్బతింటాయని, దీంతో తరచుగా ఫీజులు పోవడంతో ఎల్‌సీ తీసుకోవాల్సి వస్తుందని, దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సిబ్బంది వివరించగా అన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్చులను అమర్చాలన్నారు. తొర్రూరు, మరిపెడ మునిసిపల్ పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. రబీ సీజన్ ముగిసిన వెంటనే వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కనెక్షన్‌లు అందించాలని, నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని తెలిపారు. లాక్ బుక్‌లో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం స్టేజీ సమీపంలో ఉన్న 133/11కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని బుధవారం సందర్శించి పరిశీలించారు. విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్‌లో సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఈ కార్యాలయానికి మొదటి సారి వచ్చిన సీఎండీకి డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ నగేష్, డీఈలు నరేష్, అనిల్ కుమార్, ఏఈ వంశీ, పాండ్యు నాయక్ విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- డోర్నకల్ : రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అం దించి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం డోర్నకల్ మండలంలోని గొల్లచర్లలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఉప కేంద్రంలోఉన్న 6/11 కేవీ ఫీడర్స్ గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హన్మతండ, పకీరాతండ ఫీడర్లకు అంతరాయం లేకుండ నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో విద్యుత్ కొరతతో తాగునీటి ఎద్దడి రాకుండ సిబ్బంది ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ నరేష్, సీఎండీపెచీ ఇంజనీర్ అనిల్, డీఈ విజయ్, కురవి ఏడీఈ రమేష్, ఎస్ఏవో సంతోష్, డోర్నకల్ డిస్కం ఏఈ కిరణ్, సబ్ ఇంజనీర్ అరవింద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంజేడులో ముత్యాలమ్మ బోనాలు



గుంజేడులో ముత్యాలమ్మ బోనాలతో మహిళలు

కొత్తగూడ, మార్చి 20 : శ్రీ గుంజేడు ముసలమ్మ మహా జాతరలో భాగంగా బుధవారం గుంజేడు గ్రామస్థులు ముత్యాలమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. గ్రామస్థులు ఇళ్లను శుభ్రపరచుకుని ఇంట్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లను మామిడాకులతో, పూలతో అలంకరించుకున్నారు. సాయంత్రం డప్పువాయిద్యాలు మోగిస్తుండగా, శివసత్తుల పూనకాలతో మహిళలు బోనాలతో తరలివచ్చి శ్రీముసలమ్మ గుడి వద్ద ముత్యాలమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఈవో భిక్షమాచారి., పూజారులు తోలెం చిన్ననర్సయ్య, తోలెం వెంకటేశ్వర్లు, తోలెం వెంకన్న, కిరణ్‌కుమార్, రాంబాబుల, నవీన్‌కుమార్, అనంతరావు, భక్తులు పాల్గొన్నారు.

మానుకోట అంగడి వేలం రూ. 19.80 లక్షలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 20 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంగడి (పశువుల సంత)ను ఒక సంవత్సర కాలనికి గాను ఆర్.హరీష్‌రెడ్డి రూ. 19.80 లక్షలకు టెండర్ వేసి దక్కించుకున్నట్లు మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ తెలిపారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో బుధవారం పశువుల సంత, చికెన్ వ్యర్థాల సేకరణ, కబేలాకు వేలం నిర్వహించారు. అంగడి (పశువుల సంత) వేలానికి నలుగురు టెండర్‌దారులు పాల్గొని సీల్ టెండర్లు వేయగా అందులో అత్యధికంగా హరీష్‌రెడ్డి రూ. 19,80,000 టెండర్ వేసి పశువుల సంత నిర్వహణను దక్కించుకున్నారు. చికెన్‌వ్యర్థాల సేకరణకు టెండర్ నిర్వహించగా ఇందులో ఆరుగురు టెండర్‌దారులు పాల్గొనగా అత్యధికంగా జి.నరేష్ రూ. 18 లక్షలకు టెండర్ వేసి దక్కించుకున్నారు. కబేలా వేలానికి టెండర్‌దారులు ఎవరు ఆసక్తి చూపకపోవడంతో దీనిని తిరిగి 23వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు కమిషనర్ తెలిపారు. ఆసక్తి గల టెండర్ దారులు రీటెండర్‌లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల మేరకు ప్రచార సామగ్రి ముద్రించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిబంధనల మేరకు కరపత్రాలు, ప్రచార సామాగ్రిని ముద్రించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాప్రాతినిధ్యచట్టం 1951లోని సెక్షన్ 127-ఏ ప్రకారం కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ఇతర ముద్రణ గూర్చి నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రచార కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించే వాటిపై ప్రచురణ కర్త, చిరునామా, ప్రతుల సంఖ్య, ప్రింటర్ పేరు వాటిపై ఉండాలని తెలిపారు. వాటిని ముద్రించే ముందు ప్రచురణ కర్త డిక్లరేషన్,రెండు ప్రతులను, అతడికి వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తుల సంతకంతో ప్రింటర్‌కు ఇవ్వాలని, ముద్రణ అయిన తర్వాత ఆ డిక్లరేషన్ ప్రతిని ముద్రించిన ప్రతితో కలిపి రాజధాని హైదరాబాద్ అయితే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కేంద్రంలో ముద్రిస్తే జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థి నిబంధనను ఉల్లంఘిస్తే ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమాన విధించబడునని చెప్పారు. ప్రింట్ మీడియా ముఖ్యంగా వార్త పత్రికల్లో సరోగట్ ప్రచురణలు అంటే ప్రత్యేకంగా ఒకరాజకీయపార్టీ అభ్యర్థికి అనుకూలంగా వచ్చే వార్త కథనాలు, సంపాదకీయాలు మొదలగు వాటిపై నిశిత పరిశీలన చేసేందుకు భారత ఎన్నికల సంఘం సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. 1951లోని సెక్షన్ 77(1) ప్రకారం అట్టి వార్త కథనాల ఖర్చును రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి తరఫున ప్రకటనలు ఇచ్చేందుకు గాను ముద్రించే వారి పేరు (ప్రచురణ కర్త) , ముద్రించిన ప్రకటన ప్రతిని సమర్పించాలని, అందుకు గాను జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ప్రింట్‌మీడియా, స్థానిక వార్త పత్రికలు, మ్యాగజైన్లు, కరపత్రాలు, పోస్టర్లపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. అదే విధంగా ఎలక్ట్రానిక్ మీడియా అంటే రేడియో, ప్రైవేట్ ఎఫ్ఎం, టీవీ చానళ్లు, కెబుల్‌నెట్ వర్క్, సోషల్‌మీడియా వాటిపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి ప్రకటనలకు గాను ప్రసారం చేయబోయే వాటి రాత ప్రతులు, సీడి రెండు చొప్పున కమిటీకి ఆమోదం గూర్చి 72 గంటల ముందు సమర్పించి అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని విభాగాల వారీగా ఎన్నికల సంఘం సూచనల ప్రకారం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, అధికారులు వెంకటేశ్వర్లు, నర్మద, రాజేంద్రప్రసాద్, ప్రింటర్స్ యజమానులు వీరభద్రాచారి, యాకూబ్ రెడ్డి, రామకృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : డీఎంహెచ్‌వో

మరిపెడ, మార్చి 20 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి అన్నారు. బుధవారం ఆమె మరిపెడ పీహెచ్‌సీని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వార్డు రూం, ఫార్మసీ గది, లేబర్ రూం పరిశీలించారు. అనంతరం డ్యూటీ డాక్టర్లు, వైద్య సిబ్బంది అటెండెన్స్ పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కళావతిబాయి వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. రోగులకు సరైన సేవలందాలని సూచించారు. డాక్టర్ మానస, సీహెచ్‌వో శాంతరాణి, ఇన్‌చార్జి డీపీహెచ్ఎన్ మంగమ్మ, సూపర్‌వైజర్లు కృష్ణ, సుధాకర్, సుదర్శన్, నేత్రవైద్య సహాయకుడు బాలాజీ, ఏఎన్ఎంలు సరళ, సోములు పాల్గొన్నారు.

అనుమతి లేని విత్తనాలు అమ్మితే
కఠిన చర్యలు



ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యు

పెద్దవంగర, మార్చి 20 : ఫర్టిలైజర్ దుకాణాల్లో అనుమతి లేని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలలోని ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను తనిఖీ నిర్వహించి దుకాణాల్లో విత్తన నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రసీదు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వచ్చిన అధునాతన పద్ధతులపై వ్యవసాయధికారులు ఇచ్చే సలహాలను ఆధారంగా రైతులు వ్యవసాయం సాగు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు గురుంచి ఎటువంటి సమాచారం తెలిసిన వ్యవసాయ అధికారులకు, సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ ఏవో కుమార్ యాదవ్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన అనంతాద్రి



నేటినుంచి బ్రహ్మోత్సవాలు

భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి • 24న శ్రీవారి కల్యాణోత్సవం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 20 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని అనంతాద్రి స్వయంభూ శ్రీజగన్నాథవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 21 నుంచి 26వరకు కుంభాభిషేక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా అనంతాద్రి దేవాలయంతో పాటు పరిసరప్రాంతాలు ఉన్నాయి. శ్రీవేంకటేశ్వరుడికి నిత్యం పూజలు జరుగుతాయి. రైల్వేసౌకర్యం ఉండడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అనంతాద్రికి వచ్చి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. కోరిన కోర్కెలు తీర్చే శ్రీ జగన్నాథ వేంకటేశ్వరుడిని పూజించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. 40అడుగుల ఎత్తు, 15 ఎకరాల చుట్టూ విస్తీర్ణంతో కలిగిన అనంతాద్రి గుట్టపై స్వయంభూ శ్రీజగన్నాథ - వేంకటేశ్వర స్వామి దేవస్థానం రోజురోజుకు భక్తులు, పర్యాటకులను ఆకర్షిస్తోంది.

700 ఏళ్లనాటి ఆలయం...

700 ఏళ్ల కిందట అనంతాద్రి గుట్టపైన శ్రీ బలభద్ర సుభద్ర సమేత శ్రీజగన్నాథ స్వామి స్వయంభూవులుగా వెలసినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. 13వ శతాబ్దంలో ఆ ప్రాంతానికి శ్రీరామానుజులు కలలో జగన్నాథ వేంకటేశ్వరుడు వచ్చి తాను గుట్ట పడమటి కనుమల్లో వెలసానని చెప్పి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా ఆదేశించారని నానుడి. ఆ మరునాడే గ్రామ ప్రజలతో కలిసి గుట్టపై తిరుగుతుండగా, జగన్నాథస్వామి, వేంకటేశ్వర స్వామి విగ్రహాలు వారి కంటపడ్డాయి. ఆ తర్వాత ఆలయాన్ని నిర్మించి, పూజలు చేసేవారని ఆలయ చరిత్రద్వారా తెలుస్తోంది. అప్పట్లో రవాణా సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో భక్తుల రాక తగ్గి క్రమక్రమేణా దేవాలయం ముళ్లచెట్లతో నిండిపోయింది. ఆ తర్వాత తిరిగి 19వ శతాబ్దంలో ఆలయాన్ని పునరుద్ధరించారు. 1964లో జెన్నారెడ్డి లక్ష్మీ నర్సింహారెడ్డి, భార్య నర్సమ్మ ఆధ్వర్యంలో స్వయంభూ జగన్నాథ స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు పూర్వీకులు చెబుతున్నారు. 1964 నుంచి 1968 వరకు నిత్యపూజలు జరిగాయి. ఆ తర్వాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2002 వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఆపై నూకలరాంచంద్రారెడ్డి ఆలయాన్ని పునరుద్ధరించారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంతే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మహబూబాబాద్ రైల్వే ట్రాక్ పక్కనుంచి నూతన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి వెళ్లే దారిలో గరుత్మంతుని, ఆంజనేయస్వామి భారీ విగ్రహాలు, దేవాలయం పక్కన చెరువు మధ్యలో పెద్దజీయర్‌స్వామి విగ్రహం ఏర్పాటు చేయడంతో రోజురోజుకు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అనంతాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి కుంభాభిషేక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21న ప్రారంభమై 26న ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6గంటలకు ప్రవచనాలుంటాయి.



అనంతాద్రి గుట్టపై జగన్నాథ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

గురువారం రోజున అంకురారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 గంటల నుంచి 8:30 గంటల వరకు విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుంది. చివరి రోజు శ్రీ విష్ణుసహస్ర నామ స్తోత్రపారాయణం, దేవతోద్వాసనం, శ్రీపుష్ప యాగం, రుత్విక్ సన్మానము పూజలు నిర్వహించి ముగిస్తారు.

మృతదేహం లభ్యం

కాజీపేట, మార్చి 20: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట దర్గా రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉంది. యాచకురాలు అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 98661 67291 నంబర్‌కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 20: ఈనెల 22 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలోని జనపదలోక రాంనగర్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ బుధవారం తెలిపారు. ఎంపికైన వారిలో టి.మనోజ (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, మహబూబాబాద్), బి.హిందుప్రియా (ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఖమ్మం), రోషిణి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), పి.మనస్విత, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), జె.హర్షిత (యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ), సీహెచ్.శివశంకర్ (ఎల్‌బీ కళాశాల, వరంగల్), జి.రాజు (టీటీడబ్ల్యూఆర్‌డీసీ బాయ్స్, మణుగూరు.) బి. సూర్యకాంత్ (ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), జె.మహేశ్(వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ), జి.దిలీప్‌కుమార్(కేయూ ఇంజనీరింగ్ కళాశాల) ఉన్నారు. వీరికి హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు సభ్యులను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఇతర అధికారులు అభినందించారు.


బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ

ఐదు తులాల గొలుసు అపహరణ

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయలక్ష్మీకాలనీలో మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని యువకుడు లాక్కెళ్లాడు. కాలనీలో బందెల రమాదేవి అనే మహిళ కిరాణ షాపు నిర్వహిస్తోంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వచ్చి ఆలుగడ్డలు కావాలని బేరం చేస్తూనే ఒక్కసారిగా రమాదేవి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ హెల్మెట్‌తో ఉన్న యువకుడు బైక్ మీద పారిపోయాడు. సమాచారం అందుకున్న కేయూ సీఐ సంజీవ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కేయూ సీఐ సంజీవ్ తెలిపారు.

కమిషనరేట్‌కు ఐపీఎస్ అధికారి

వరంగల్ క్రైం, మార్చి20: గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న 2020 బ్యాచ్ ఐపీఎస్ అంకిత్‌కుమార్‌ను వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ బుధవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అంకిత్ కుమార్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంకిత్‌కుమార్‌ను సీపీ అభినందించారు.


సీపీని కలిసిన అంకిత్‌కుమార్

15 ఏళ్లుగా..

ఐసెట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం

ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్రం దాకా దక్కిన గౌరవం

కేయూ క్యాంపస్, మార్చి 20: రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-24 నిర్వహణ 15వ సారి కాకతీయ యూనివర్సిటీకే దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా ఈ ఏడాది 15వ దఫా ఐసెట్ నిర్వహణ కేయూకే దక్కడం గర్వకారణం. రాష్ట్ర ఉన్నత విద్య మండలి యేటా ప్రవేశ పరీక్షలను ఒక్కో వర్సిటీకి కేటాయిస్తుంటుంది. అయితే ఐసెట్ నిర్వహణను మాత్రం ఉమ్మడి ఏపీ నుంచి వరుసగా కాకతీయ యూనివర్సిటీకే అప్పగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కేయూ వరుసగా 6దఫాలుగా ఐసెట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించింది. 2014 నుంచి ఇప్పటి వరకు కేయూనే వరుసగా పకడ్బందీగా నిర్వహిస్తోంది. వర్సిటీలో మొదటగా ప్రొఫెసర్ ఓంప్రకాశ్, శర్మ, ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ వరలక్ష్మిలు కన్వీనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అదే క్రమంలో ప్రస్తుతం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారిని కన్వీనర్‌గా నియమించారు.

భారీగా పోటీ..

యేటా ఐసెట్ పరీక్షలు రాసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. మేనేజ్‌మెంట్ రంగంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు వస్తుండటంతో బీటెక్ చేసిన అభ్యర్థులు సైతం ఎంబీఏ వైపు వస్తున్నారు. సగటున ఏడాదికి 70వేల మందికి పైనే అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లోనూ ఎంబీఏ అభ్యర్థులకు మంచి ఉద్యోగ అవకాశాలున్నాయి. స్కిల్ ఉన్న అభ్యర్థులను కార్పొరేట్ సంస్థలు భారీ ప్యాకేజీలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి.

ఏదైనా డిగ్రీ

గుర్తింపుపొందిన వర్సిటీ నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, ఇంజనీరింగ్‌తోపాటు ఏదైనా డిగ్రీ కోర్సు పాసైన అభ్యర్థులందరూ ఐసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఫైనలీయర్ చదవుతున్న అభ్యర్థులు సైతం ఐసెట్ పరీక్షలకు హాజరుకావచ్చు. ఐసెట్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంటి. 75 మార్కుల చొప్పున ఎనలైటికల్ ఎబిలిటీ, మ్యాథ్స్ ఎబిలిటీ సిలబస్‌తోపాటు మరో 50 మార్కులకు జనరల్ ఇంగ్లీష్‌లో సిలబస్ రూపొందించారు. అత్యధిక స్కోరు సాధించిన అభ్యర్థులకు ఉస్మానియా, కేయూ, పాలమూరు. శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీతోపాటు ఇతర వర్సిటీల్లోనూ సీట్లు పొందే అవకాశం ఉంది.


ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్)

షెడ్యూల్ విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో 2023-24 ఏడాదికి ప్రవేశాల మార్చి 5న టీఎస్‌ఐసెట్-24 నోటిఫికేషన్ విడుదల అయింది. మార్చి 7 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 17 నుంచి 27 వరకు రూ. 250, రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తులను స్వీకరిస్తారు. జూన్ 4, 5వ తేదీల్లో కంప్యూటర్ బెస్డ్ పరీక్ష నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ప్రకటించారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఐసెట్ చైర్మన్



వరుసగా కేయూకు 15వ దఫా ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉంది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ పరీక్షలను నిర్వహిస్తాం. విద్యార్థులకు ఎల్లప్పుడూ సందేహాలను తీర్చేందుకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణతో పాటు ఏపీలోనూ ఐసెట్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

నేడు కేయూకు మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య రాక

కేయూ క్యాంపస్, మార్చి 20: కేయూ సెనెట్‌హాల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ రామచంద్ర మిషన్ ఇన్‌స్టిట్యూట్ నేతృత్వంలో జరిగే ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛత, ఇతర విద్యార్థి ఉద్యోగార్థులకు ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పించేందుకు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ ఆదిత్య ఆర్య, యూఎస్ఏ నుంచి డాక్టర్ అరిహంత మాధవ మోహన్ హాజరుకానున్నట్లు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కేయూ వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందితోపాటు పరిశోధకులు, విద్యార్థులందరూ రావాలని కోరారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు పాటుపడాలి

వరంగల్ మెడికల్, మార్చి 20: కుష్టువ్యాధి నివారణలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర లెప్రసీ ఎల్‌సీడీసీ కార్యక్రమల పరిశీలకుడు డాక్టర్ మైకేల్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. కుష్టువ్యాధి నివారణకు ఆశ కార్యకర్తల నుంచి అధికారుల వరకు అందరూ పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం

హనుమకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితా ఓ కవితా అన్న శీర్షికన ఆకాశవాణి వరంగల్ కేంద్రం గురువారం కవి సమ్మేళనం ప్రసారం చేయనున్నదని ఆకాశవాణి వరంగల్ కార్యక్రమం అధికారి ఇల్లెందుల రవికుమార్ తెలిపారు. అకాశవాణి వరంగల్ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించే ఈ కవి సమ్మేళనంలో వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, డాక్టర్ జరీనాబేగం, చేపూరి శ్రీ రామారావు, డాక్టర్ మంతెన శంకర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, రమేశ్వర్ రాజు, బిల్ల మహేందర్ వనపర్తి పద్మావతి, హాజీ నురానీ కవితలను ముందుగానే రికార్డు చేశామని ఆయన తెలిపారు. ఈ కవిసమ్మేళనంలో గేయాలు, పద్యాలు, వచన కవితలు, మినీ కవితలు, మణిపూసలు ఇలా అన్ని ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: తెలంగాణ రాష్ట్రం భవన నిర్మాణ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు ఎన్ఏసీ ఇన్‌స్ట్రక్టర్ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల శిక్షణలో ఎలక్ట్రీషియన్, హౌస్‌వైరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. 10వ పాస్ అయి 18 నుంచి 30 యేళ్లలోపు వారై ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచిత యూనిఫామ్, ఉచిత మధ్యాహ్నం భోజనం అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత న్యాక్ సర్టిఫికెట్ అందించి ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 7989247723, 9949684763 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని గోపాల్ సూచించారు.

కెనాల్‌లో పడిన వ్యక్తి

కాపాడిన ఇద్దరు యువకులు

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టు క్యాంపు వద్ద కుమార్‌పల్లికి చెందిన యువకుడు బుధవారం మధ్యాహ్నం కెనాల్‌లో పడిపోయాడు. అటుగా వెళుతున్న లక్ష్మణ్, సాయి అనే ఇద్దరు యువకులు కెనాల్‌లో దూకి యువకుడిని కాపాడారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన లక్ష్మణ్, సాయిలను ఎస్ఐ రాజ్‌కుమార్ అభినందించారు.


యువకుడిని కాపాడుతున్న స్థానికులు

పకడ్బందీగా పోలీసుల నిఘా, తనిఖీలు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులు ● లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు

వరంగల్ క్రైం, మార్చి20: మే మాసంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పోలీసు భద్రతను పటిష్ఠం చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు విస్మరించి డబ్బు, నగలు, మద్యం సరఫరాను చెక్ పోస్టులతో నియంత్రించనున్నారు. నిబంధనలను విస్మరించి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తరలిస్తే స్వాధీనం చేసుకోనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిరంతరం చెక్ పోస్టుల తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.

చెక్ పోస్టుల వివరాలు

- వరంగల్ జిల్లా పరిధిలో నర్సంపేట నియోజకవర్గంలో అయ్యప్ప గుడి నర్సంపేట, బోలోన్‌పల్లి (నల్లబెల్లి), అశోక్‌నగర్ (ఖానాపురం)
- తూర్పు నియోజకవర్గంలో ఎంజీఎం సర్కిల్, నాయుడు పెట్రోల్‌పంపు, జాన్‌పాక్ లేబర్‌కాలనీ.
- వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో అనంతసాగర్ (హసన్‌పర్తి), డీసీ తండా, చింత నెక్కొండ.
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కాజీపేట డీజిల్ కాలనీ, ఐశ్వర్య గార్డెన్ (ములుగు రోడ్), సీఎస్ఆర్ గార్డెన్ (హంటర్‌రోడ్డు).
- పరకాల నియోజకవర్గంలో కటాక్షపూర్ క్రాస్‌రోడ్డు, కొమ్మాల, నడికూడ.
- హుస్నాబాద్ నియోజకవర్గం పెంచికలపేట (ఎల్కతుర్తి).
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో జీడికల్ (లింగాలఘణపురం), నల్లబండ (జఫర్‌గడ్), రాంపూర్ (ధర్మసాగర్).
- పాలకుర్తి నియోజకవర్గం మొండ్రాయి (దేవరుప్పుల), కిష్టాపూర్ క్రాస్‌రోడ్డు (రాయపర్తి).
- జనగామ నియోజకవర్గం పెంబర్తి (జనగామ), ఇన్యానాయక్ తండా (తరిగొప్పుల), కొన్నె క్రాస్‌రోడ్ (బచ్చన్నపేట).

మతాన్ని ప్రోత్సహించే ఎన్ఈపీ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

కేయూ క్యాంపస్, మార్చి 20: మతాన్ని ప్రోత్సహిస్తూ, మనుషుల్లో తారతమ్యాలను తెచ్చే నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కేయూ దూరవిద్యకేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎల్ మూర్తి హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన అన్‌సైంటిఫిక్ ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో మతాన్ని ప్రవేశపెట్టే విధానాలను కేంద్రం మానుకోవాలని డిమాండ్ చేశారు. బడా పెట్టుబడిదారులకు కంపెనీ జీతగాళ్లుగా తయారు చేసే విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని అన్నారు. వర్సిటీల స్వయంపతిపత్తిని కాపాడాలని అన్నారు.

ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ ఎన్నిక

కాకతీయ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని 17 మందితో నియమించగా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికిరణ్, స్టాలిన్‌లు ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పరిమిళ, అరుణ్, సహాయకార్యదర్శిగా అనూష, జస్వంత్, ట్రెజరర్‌గా అభిరామ్, కమిటీ సభ్యులుగా వరుణ్‌తేజ్, సాయి ప్రసన్న, సందీప్, తేజస్విని, సాయితేజ, పవన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభ నూతనంగా ఎన్నికైన కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. వర్సిటీల స్వయం పతిపత్తిని కాపాడాలని, కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, వర్సిటీల్లో ఖాళీగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని తీర్మానాల్లో కోరారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయాలని, సరైన అర్హతలున్న వారినే వీసీలుగా నియమించాలని, రాజకీయ ప్రాబల్యం వద్దని కోరారు. పెంచిన వర్సిటీల్లోని ఫీజులను తగ్గించాలని, కేయూ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. నూతన కమిటీకి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ అభినందించారు. వివిధ డిపార్టుమెంట్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

నగరంలో హంగులతో కూడిన క్రికెట్ స్టేడియం

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 20: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఉప్పల్ స్టేడియం తరహాలో అన్ని హంగులతో కూడిన రంజీ మ్యాచ్‌లు ఆడే వసతుల కలిగిన నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హెచ్‌సీఏ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్ రావు తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్‌మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు.

అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంటే ఒక్క హైదరాబాద్ ప్రాంతానికే పరిమితం కాదని, రాష్ట్రంలో ఉన్న 10 జిల్లాల సొత్తు అని పేర్కొన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. క్రికెట్‌ను మారుమూల ప్రాంతాలకు విస్తరించేలా హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతిభ గల క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. త్వరలోనే వరంగల్ నగరంలో క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తామన్నారు. వరంగల్‌లో క్రికెట్ క్లబ్ ఏర్పాటుకు జిల్లాలోని వివిధ క్రీడాసంఘాల బాధ్యులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉన్న హ్యాండ్‌బాల్ అకాడమీని ఎట్టి పరిస్థితుల్లో తరలించకూడదని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈసమావేశంలో ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, బైరబోయిన కైలాస్ యాదవ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, ఫైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణితో పాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో జగన్‌మోహన్‌రావు

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు విష్ణు, కోశాధికారిగా బి. నరేందర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పోగుల అశోక్, ఎస్. రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి. అశోక్, ఈసీ సభ్యులుగా సంతోష్, శ్రీధర్, వీరస్వామి, శ్రీను, కిరణ్, నాగరాజులను ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

డోర్నకల్ మండలంలో అదనపు కలెక్టర్ పర్యటన


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో

డోర్నకల్, మార్చి 20 :డోర్నకల్ మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పో బుధవారం పర్యటించారు. తొలుత డోర్నకల్ మునిసిపాలిటీలోని గొల్లబజారులో నిర్మించనున్న ఇండోర్ స్టేడియం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మురుగునీటి కాల్వల నిర్మాణం గురించి స్థానికులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో మాస్టర్‌డ్రైన్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అక్కడ్నుంచి అమ్మపాలెం, తహసీల్దార్ బంజర గ్రామాలను సందర్శించారు. అదనపు కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌లు ఉన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేయాలి


హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరిస్తున్న వివిధ పార్టీల నాయకులు

కేసముద్రం, మార్చి 20 : కేసముద్రం మండల సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేయాలని కోరుతూ ఈ ప్రాంత వాసి అయిన సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి హైదరాబాద్‌లో బుధవారం వివిధ పార్టీల నాయకులు వినతిపత్రం అందజేశారు. తొలుత ఆయన్ను శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కేసముద్రం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, బైపాస్‌రోడ్డును డబుల్‌బీటీరోడ్డుగా నిర్మాణం చేయాలని కోరారు. తదితర సమస్యలు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు పొదిల నర్సింహారెడ్డి, గుగులోత్ వీరునాయక్, ముత్యాల శివకుమార్, మార్తినేని పాపారావు, చొప్పరి శేఖర్ పాల్గొన్నారు.

కురవిలో పార్వతీరామలింగేశ్వరస్వామి కల్యాణం


కురవి శివాలయంలో పార్వతీరామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కురవి, మార్చి 20 : కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయానికి ఉప ఆలయంగా ఉన్న శివాలయంలో బుధవారం శ్రీపార్వతి రామలింగేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శివాలయానికి జీర్ణోద్ధరణ చేసిన తర్వాత జరిగిన తొమ్మిదవ కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ అర్చకులు, ఈవో సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డి వీరభద్రస్వామి దేవాలయం నుంచి ఊరేగి ంపుగా మేళతాళాలు, వాయిద్యాల నడుమ శివాలయానికి వెళ్లి పార్వతి రామలింగేశ్వరస్వామిలకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు బాలకృష్ణ, శ్రీకాంత్, విజయ్, అనిల్, పుణ్యమూర్తి సాంప్రదాయబద్ధంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవితధారణ, బాషికాధారణ, మధుపర్కపూజ, కన్యాదానం, సుమూహర్తం అనంతరం ప్రధాన అర్చకులు పార్వతి అమ్మవారికి రామలింగేశ్వరాస్వామి వారిచే మాంగళ్యధారణ గావించారు.

దంత సంరక్షణతో నోటికి ఆరోగ్యం

తొర్రూరు, మార్చి 20 : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే దంత సంరక్షణ తప్పనిసరి అని తొర్రూరు డివిజన్ డెంటల్ వైద్యాధికారి మీరజ్ అన్నారు. బుధవారం ప్రపంచ ఓరల్ హెల్త్ డే సందర్భంగా డివిజన్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నోటి ఆరోగ్యం బాగుంటేనే శారీరక ఆరోగ్యం బాగుంటుందని, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యులతో పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్, డాక్టర్ జ్వలిత, ప్రియాంక, పాఠశాల హెచ్‌ఎం రాజసుకన్య పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు


మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, మార్చి 20 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోడ్ దృష్ట్యా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, పట్టణంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో బాంబ్‌స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. అనుమానం వచ్చిన ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేయడంతో పాటు వారి వివరాలను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. మద్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై అరుణ, బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగారంలోనూ..

గంగారం : గంగారంలో బుధవారం సాయంత్రం గూడూరు సీఐ బాబూరావు నేతృత్వంలో గంగారం ఎస్‌ఐ రవికుమార్ వాహన తనిఖీలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో సమస్యాత్మకమైన గంగారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సీఐ పరిశీలించారు. సమస్యాత్మక మైన గ్రామాలను పరిశీలించి ఆ గ్రామాలలో ప్రశాంతమైన పోలింగు జరగేందుకు తగు సూచనలు సలహాలను తీసుకోవలసిన జాగ్రత్తలను గంగారం ఎస్‌ఐ రవికుమారికు వివరించారు. అనంతరం గంగారం సెంటర్‌లో వాహన తనిఖీలు చేసి అనుమానితులను ప్రశ్నించారు. గంగారం నుంచి ఇల్లందుకు, గంగారం నుంచి కొత్తగూడ వెల్లే వాహనాలను క్షుణంగా పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గ్రామస్థులు సహకరించాలని ఆయన కోరారు.

వాహనాల వేలానికి రూ.5.12లక్షల ఆదాయం


గూడూరులో వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్

గూడూరు, మార్చి 20 : గూడూరు మండల కేంద్రంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్‌లో ఆయా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలం పాట నిర్వహించగా రూ.5.12 లక్షల ఆదాయం వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ తెలిపారు. వేలం పాటలో తొమ్మిది వాహనాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వాటి అమ్మకం ద్వార ప్రభుత్వానికి రూ.4,34,500, జీఎస్టీ ద్వార రూ.77,580 మొత్తం రూ.5,12,080 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎక్సైజ్ సీఐ బిక్షపతి, ఎస్సై రాజేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి : ప్రిన్సిపాల్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 20 : రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు అన్నారు. మహబూబాబాద్ నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఫిబ్రవరి రెండవవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి జిజ్ఞాస పోటీల్లో కళాశాల తృతీయ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాలవృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ టి.యుగందర్ పర్యవేక్షణలో గ్రీన్ సింథసిస్ ఆఫ్ సిల్వర్ నానో పార్టికల్స్ యూజింగ్ అజాడిరక్త ఇండికా (యల్)లీఫ్ ఎక్స్‌ట్రాక్ట్‌విత్ క్యారెక్టరైజేషన్ బై యువి స్పెక్ట్రోస్కోపి ఫర్ క్యాన్సర్ టార్గెటింగ్ అనే అంశంపై విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుగైడ్ అధ్యాపకుడు యుగందర్ నేతృత్వంలో విద్యార్థులు నవ్య, అఖిల, ఉదయశ్రీ, ఉష, సాయిరాం, వీరాసింగ్, శ్రావణిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ అధ్యాపకులు మమత, రామారత్నమాల, బొంద్యాలు, వెంకటేశ్వర్లు, శశికాంత్, మల్లేషం, రాజేందర్, నరహరి, రామ్‌రెడ్డి, హతిరామ్, వీరు, ఉపేందర్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

కొత్తగూడ, మార్చి 20 :అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను ఎస్సై దిలీప్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోపాలపురం క్రాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనాలపై అక్రమంగ తరలిస్తున్న 4క్వింటాల పీడీఎస్ బియ్యంను, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు., చెన్నారావుపేట మండలం సూర్యపేట తండాకు చెందిన గోవర్ధన్, చెరువు ముందు తండాకు చెందిన జూమ్లాపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

తొర్రూరు, మార్చి 20 : ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు దారం ప్రసాద్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో ఉప ఆలయాల నూతన కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులతో పాటు ప్రజలు సహకరించాలని కోరారు. డివిజన్ పరిధిలోని తొర్రూరులో మొదటిసారి ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి ఆలయం నిర్మాణం చేశామని, భక్తులు ప్రత్యేక రోజుల్లో వ్రతాలు, శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు చేసుకునే వీలుంటుందన్నారు. ఆలయ కమిటీ కన్వీనర్‌గా చీదర వీరన్నను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వల్లపు మధు, ఇమ్మడి రాంబాబు, దారం ప్రసాద్, సురేష్, అశోక్, హీరాధర్, వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

డోర్నకల్, మార్చి 20 : గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ పత్రి పూలమ్మ ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఆదివాసీ నాయకపోడు డోర్నకల్, ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులు బుధవారం భూపతిపేటలో పూలమ్మకు రూ.10 వేల ఆర్థికసాయంతో పాటు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకపోడు జిల్లా ప్రధాన కార్యదర్శి దబ్బ శ్రీను, పులి శ్రీను, మందారపు సాంబయ్య, దబ్బ సాంబయ్య, బేతోలు శ్రీను, కట్ల నరేష్, మట్ల కిశోర్, పత్రి వెంకటేశ్వర్లు, భీమేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, సతీష్, రామకృష్ణ, గంగాధర్, మధుసూదన్, మడప సతీష్, సాయిబాబా పాల్గొన్నారు.

50 ఆకుల తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 20 :50 ఆకుల తునికాకు కట్టకు రూ.5లు చెల్లించాలని అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ కృష్ణారావుకు బుధవారం వినతిపత్రం అందించారు. గుజ్జు దేవేందర్, తాజ్‌పాషా పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ కవిత

మహబూబాబాద్ టౌన్, మార్చి 20: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సంకా సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఎంపీ మాలోతు కవిత పరామర్శించారు. మహబూబాబాద్ పట్టణంలో ఇటీవల పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకాబద్రినారాయణ తండ్రి సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎంపీ కవిత స్థానిక అడ్వకేట్స్ కాలనీలో సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కేసముద్రం మార్కెట్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు షేక్, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఐదు లీటర్ల గుడుంబా పట్టివేత...

డోర్నకల్, మార్చి 20 : డోర్నకల్ మండలం కస్నాతండ గ్రామపంచాయతీ శివారు ఇస్త్రాతండాలో ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఇస్లావత్‌తండా వద్ద డోర్నకల్ ఏఎస్సై కోటేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా శారద అనే మహిళ సంచి పట్టుకుని రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండడంతో ఆమెపై అనుమానం రావడంతో ఆమె సంచిని తనిఖీ చేసినట్లు చెప్పారు. సంచీలో ఐదు లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు, మార్చి 20: గూడూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మట్టెవాడ లైన్ మరమ్మతుల్లో భాగంగా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్టెవాడ లైన్ పరిధిలో ఉన్న మట్టెవాడ, ఊట్ల, శ్రీహనుమాన్‌తండా గ్రామప్రజలు ఇందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

డోర్నకల్, మార్చి 20 : మేక పిల్లలకు దాన తీసుకురావాలని భార్య చెప్పడంతో భార్యభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి జోగ్యతండాలో చోటు చేసుకుంది. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం జోగ్యతండాకు చందావత్ చిమున(50) అనే వ్యక్తికి సుమారు 20 మేకలు ఉన్నాయి. దీంతోపాటు కొంత వ్యవసాయ భూమి ఉంది. ఈ క్రమంలో చిమున మంగళవారం మేకలను మేతకు తీసుకువెళ్లి సాయంత్రం ఇంటికి తీసుకువచ్చాడు. వచ్చిన వెంటనే చిమున భార్య చుక్కాలి మేకపిల్లలకు దాన తీసుకురమ్మని చెప్పింది. దీంతో అప్పుడే వచ్చిన చిమున ఇప్పుడే కదా వచ్చిందంటూ భార్య చుక్కాలిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో భార్యభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన చిమున తనచేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన పక్కపొలాల రైతులు చిమునను కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ... చిమున మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య చుక్కాలి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య చుక్కాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్య తీసుకోవాలి

మరిపెడ, మార్చి 20 : జాతీయ రహదారులకు ఇరువైపులా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మరిపెడ విలేజీకి చెందిన యువకులు బుధవారం తహసీల్దార్ సైదులు, మరిపెడ మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. ఇటుక బట్టీల ద్వారా పొగ వ్యాపించి ఊపిరాడక అనేక మంది రోగాల బారిన పడుతున్నట్లు అధికారులకు వివరించారు. అల్వాల ఉపేందర్, ఉడుగుల రాజు, గుండగాని నరేశ్, గంధసిరి కృష్ణ, మీరా హుస్సేన్, యుగేంధర్, పాకల సంతోశ్ తదితరులు ఇటుక బట్టీలపై ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కేసముద్రం, మార్చి 20: కేసముద్రం మండలం బేరువాడలో బుధవారం వ్యవసాయ బావి పూడిక తీస్తుండగా విద్యుదాఘాతంతో అదే గ్రామానికి చెందిన బానోత్ రమేష్(40) మృతి చెందినట్లు ఎస్‌ఐ వంశీధర్ తెలిపారు. గ్రామంలో ఒక రైతుకు చెందిన వ్యవసాయ బావిలో పూడిక తీసే ందుకు క్రేన్ పనికి రమేష్ దినసరి కూలీగా వెళ్లాడు. బావిలోని నీళ్లను తోడే ందుకు ఏర్పాటు చేసిన సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను సరిచేస్తుండగా విద్యు దాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జాతీయ స్థాయి స్థాయి పోటీలకు ఎంపిక

కేసముద్రం, మార్చి 20 : పంజాబ్‌లో ఈనెల 21 నుంచి నిర్వహించే జాతీయస్థాయి జూనియర్స్ అసోసియేషన్ బేస్‌బాల్ పోటీలకు మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌కు చెందిన ధరావత్ అజంత, బానోత్ శ్రావణిలు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కల్లూరి ప్రభాకర్‌రావు తెలిపారు. ఇటీవలె కరీంనగర్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఈ విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సదరు విద్యార్థులను సాఫ్ట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల సంజీవరావు, సమ్మెట ప్రేమ్‌కుమార్, అవారి శ్రీనివాస్, పీడీ పద్మావతి, ప్రిన్సిపాల్ రూపాస్, పీడీ సమ్మెట లలిత అభినందించారు.

పస్తం సైదులుకు డాక్టరేట్

తొర్రూరు, మార్చి 20 : తొర్రూరు డివిజన్ కేంద్రానికి చెందిన అనువంశిక ఆయుర్వేద వైద్య నిపుణుడు, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు పస్తం సైదులుకు అల్లూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో డాక్టర్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా పస్తం సైదులు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డు అందించిన అల్లూరి కల్చరల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షిక వేడుకలు


తాళ్లపూసపల్లిలో బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న రవిచందర్‌రెడ్డి , గ్రామస్థులు

కేసముద్రం, మార్చి 20 : మండలంలోని తాళ్లపూసపల్లిలో బుధవారం బొడ్రాయి 12వ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మహిళలు బిందెలతో నీళ్లు తీసుకువచ్చి బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు రవిచందర్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని బొడ్రాయి ఉత్సవాలు నిర్వహించామన్నారు ఈ కార్యక్రమంలో నరేటి సత్తయ్య, గొడిశాల వెంకన్న, గొర్రె వెంకన్న, నరేటి కొమురయ్య, బండి వెంకన్న, శీలం రాములు, కాలేరు వెంకన్న, కాలేరు మురళి పాల్గొన్నారు.

పూసపల్లి కుట్ర కేసును ఎత్తివేయాలి

గూడూరు, మార్చి 20 : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర,రాష్ట్ర జిల్లాతో పాటు స్థానిక నాయకత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూసపల్లి కుట్ర కేసును బనాయించిందని, ఆ కేసును వెంటనే ఎత్తివేయాలని ఆ పార్టీ సబ్‌డివిజన్ కమిటీ సభ్యులు గజ్జి లింగన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎడంపాక శ్రీశైలం డిమాండ్ చేశారు. గూడూరు మండలం బొద్దుగొండలో వాల్‌పోస్టర్లను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌తో పాటు పలువురిని ఫిబ్రవరి 14న ఖమ్మం సమీపంలో అరెస్టు చేసి ఈనెల 17న రిమాండ్ చేశారని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు శివారు పూసపల్లి వద్ద అరెస్టు చూపిన పోలీసులు రిమాండ్ రిపోర్టులో తప్పుడు పద్దతుల్లో పార్టీ అధినాయకత్వంపై కేసులు బనాయించారని ఆరోపించారు. వెంటనే పూసపల్లి కేసును ప్రభుత్వం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భద్రయ్య, ఫరీద్, నర్సయ్య పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

గూడూరు, మార్చి 20 : సహకార సంఘాలను బలోపేతం చేయాలని గూడూరు సొసైటీ ఛైర్మన్ చల్లా లింగారెడ్డి అన్నారు. గూడూరు సొసైటీ కార్యాలయంలో బుధవారం మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ రైతులు సొసైటీ ద్వార తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించి సొసైటీని బలోపేతం చేయాలన్నారు. వైస్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, సీఈవో రాజేష్, డైరెక్టర్లు యాకూబ్‌పాషా, యాకయ్య, యాకాంబ్రం, మల్లేష్, వెంకన్న పాల్గొన్నారు.


బెజ్జం వెంకన్నకు టీడీపీ, టీఎంఎం నివాళులు

కేసముద్రం, మార్చి 20 : టీడీపీ ఎస్సీసెల్ పార్లమెంటు కార్యదర్శి కేసముద్రం మండల మాజీ అధ్యక్షుడు, తెలంగాణ మాలమహానాడు నాయకుడు బెజ్జం వెంకన్న గుండెపోటుతో మృతిచెందగా ఆయన మృతదేహానికి పార్టీ, సంఘాల నాయకులు నివాళులర్పించారు. బుధవారం కేసముద్రం విలేజిలోని ఆయన ఇంటి వద్ద మృతదేహంపై పార్టీ, సంఘం జెండాను కప్పి జోహార్లర్పించారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, వై.ఎల్లయ్య, సట్ల నర్సయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలమ్మ జాతర ప్రారంభం

కొత్తగూడ, మార్చి 20 : మండలంలోని ఎంచగూడెంలో వాసం వంశీయుల ఇలవేలుపు కొమ్మాలమ్మ దేవత జాతర బుధవారం ప్రారంభం అయింది. ముందుగా గోపాలపురం గ్రామం నుంచి వాసం వీరాస్వామి కొమ్మాలమ్మ ముడుపు, ఎదురుయాటను ఎంచగూడెంకు తీసుకువచ్చారు. సాధిరెడ్డిపల్లిలో వాసం నాగయ్య ఇంటి నుంచి మెత్తిపానుపు తీసుకువచ్చారు. సాయంత్రం కొమ్మాలమ్మ దేవతను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో దల్వాయివాసం సమ్మయ్య, జలకపు వడ్డె యాలం లక్ష్మయ్య, ఉద్యోగులు వాసం కుమారస్వామి, ఆలూరి సమ్మయ్య, వాసం పాపయ్య, వాసం సందీప్, ఆలూరి సారం గపాణి, వాసం ప్రభాకర్, ఆలూరి క్రిష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఆస్తి పన్ను వసూళ్లు


గులాబీ పువ్వు ఇచ్చి పన్నులు చెల్లించాలని కోరుతున్న సిబ్బంది

తొర్రూరు, మార్చి 20 : మునిసిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో అధికారులు బకాయిదారుల ఇండ్ల ముందు డప్పులు కొడుతూ, పూలు అందిస్తూ వివిధ రకాలుగా వసూళ్లు చేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలకు పూలు అందించి బకాయిలు చెల్లించాలని కోరారు. బకాయిలు పేరుకుపోవడంతో 1, 2 నోటీసులు ఇచ్చామని, మరో నోటీసుకు తప్పనిసరిగా ఆస్తులు జప్తు చేస్తామని తెలిపారు. మునిసిపల్ సిబ్బంది కట్టస్వామి, రాజు, దేవేందర్, నవీన్, ఉపేంద్ర, రేణుక, శంకర్, యాకయ్య ఉన్నారు.

రాణూనాయక్ పోరాటం మరువలేనిది


రాణూనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న సేవాలాల్ సేన నాయకులు

నెహ్రూసెంటర్, మార్చి 20 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రజాకార్లను ఎదురించిన ధైర్యశీలి జాటోతు రాణూనాయక్ అని సేవాలాల్ సేన జాతీయ కోర్ కమిటీ సభ్యులు దారావత్ మోతీలాల్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా మోతీలాల్ మాట్లాడారు. రాణూనాయక్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దారావత్ వెంకన్న, గుగులోతు నందులాల్, మాలోతు సురేష్, లకావత్ పద్మ, జర్పుల బాలు, బానోత్ వినోద్, భూక్య స్రవంతి, పూజా, లక్ష్మి, బోడ దిలీప్, గుగులోతు మాలు, బోడ సుమన్, బానోత్ ప్రసాద్, నరేందర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పేస్లిప్‌లు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 20 : మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాల చెల్లింపుకు ముందు పేస్లిప్‌లను అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేష్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో ఉపాధి కూలీల ఎదుర్కొంటున్న సమస్యలను ఏపీవో రమేష్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, మల్లయ్య, అశ్విని, నరేష్, యాదగిరి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

కురవి, మార్చి 20 :ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంతో సమానమని మహబూబాబాద్ డీఆర్‌డీవో పురుషోత్తం అన్నారు. కురవిలోని నాగార్జున విద్యాలయంలో బుధవారం ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన ఓటుహక్కుపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు తప్పనిసరిగా నమోదుచేసుకోవాలన్నారు. ఎన్నికలలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీపరులను ఎన్నుకోవాలన్నారు. తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు పాల్గొన్నారు.

హుస్సేన్‌నాయక్‌ను కలిసిన నేతలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 20 :జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ మెంబర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన జాటోతు హుస్సేన్‌నాయక్‌ను హైదరాబాద్‌లో ఆయన నివాసంలో జిల్లా బీజేపీ శ్రేణులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుగా ఎన్నికైన హుస్సేన్‌నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సిరికొండ సంపత్, బాలునాయక్, శ్యాంప్రసాద్, వెంకటేష్, సంతోష్ పాల్గొన్నారు.

సీతానగరం వాసికి డాక్టరేట్

గూడూరు, మార్చి 20 : గూడూరు మండలం సీతానగరం గ్రామానికి చెందిన రాగిడి రణధీర్‌రెడ్డి రాజస్తాన్ రాష్ట్రంలోని ప్రఖ్యాతగాంచిన కెరియర్ పాయింట్ యూనివర్శిటీలో విద్యుత్ విభాగంలో పవర్ ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టుకు సంబంధించిన ఇన్ అవర్ సాఫ్ట్ స్విచ్చింగ్ ఫుల్ బ్రిడ్జి డీసీ టు డీసీ కన్వర్టర్ యూజింగ్ ఫర్ మోడ్లేషన్‌కు సంబంధించిన రీసెర్చ్ విభాగంలో తమిళనాడుకు చెందిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎస్.మణికందన్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకుగాను యూనివర్శిటీ రణధీర్‌రెడ్డికి డాక్టరేట్ పట్టాను అందించింది. రణధీర్‌రెడ్డి డాక్టరేట్ పట్టా పొందడం పట్ల కుటుంబసభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.